

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా పాతపాటి వాసు



కాళ్ల: రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) నియమితులయ్యారు. మరోసారి ఈ కీలక పదవి తమ ప్రాంతానికే దక్కడంతో ఉండి నియోజకవర్గ వైసిపి శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన పాతపాటి వెంకట శ్రీనివాసరాజు వైసిపిలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. శ్రీనివాసరాజు తండ్రి పాతపాటి సర్రాజు గతంలో ఎంఎల్‌ఎగా పని చేశారు. వైసిపి అధికారంలోకొచ్చాక క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పదవిని చేజిక్కించుకున్నారు. అయితే గత ఫిబ్రవరిలో సర్రాజు గుండెపోటుతో మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయన పెద్దకుమారుడు వాసుకు క్షత్రియ కార్పొరేషన్ పదవిని సిఎం జగన్ కట్టబెట్టారు.

దోసపాడు దళితుల పోరు ఉధృతం

- భూముల్లోకి వెళ్లి చేపలు పట్టి నిరసన తెలిపిన పేదలు, నేతలు
- లోకాయుక్త తీర్పు ఎందుకు అమలు చేయరని అధికారులకు ప్రశ్నలు
- సంపన్నులకు కొమ్ముకాస్తున్న అధికారుల తీరుపై ఆగ్రహం
- పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, దెందులూరు

దోసపాడులో పేద దళితుల భూపోరాటం ఉధృతమైంది. ఇప్పటి వరకూ పాదయాత్రలు, నిరసనలు, రిలే నిరాహార దీక్షలు చేస్తూ ముందుకు సాగిన బాధిత దళితులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కదం తొక్కారు. తమ భూముల్లో అక్రమంగా చేపల చెరువులు తవ్వి అందులో భూస్వాములు సాగు చేస్తున్న చేపలను వలలు వేసి పట్టి నిరసన తెలిపారు. తమ భూములు తమకు పంపిణీ చేసే వరకూ పోరాటం ఆగదని పేదలు హెచ్చరించారు. 'పేదల ఐక్యత వర్ధిల్లాలి, మా భూములకు రక్షణ కల్పించాలి. మా భూములను మాకు వెంటనే ఇవ్వాలి' అంటూ బాధిత పేదలంతా చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. దోసపాడు బాధిత పేదలకు అండగా నిలుస్తూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొన్నారు. పేదలతోపాటు వి.శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ చెరువుల్లోకి దిగి చేపలు పట్టి నిరసన తెలిపారు. గుండెలోతు నీటిలోకి దిగి పేదల పక్షాన ఆందోళన చేపట్టారు.

పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పేదల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని, దోసపాడులోని పేదల భూములను సంపన్నుల చేతుల్లోంచి స్వాధీనం చేసుకుని పేదలకు అప్పగించాలని వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పేదల భూములకు రక్షణ లేకుండా పోయిందని, పేదల భూములను సంపన్నులు ఆక్రమించుకుని అనుభవిస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 2015లో లోకాయుక్త పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

అధికారులు ఎందుకు అమలు చేయడం లేదంటూ నిలదీశారు. దోసపాడులో సుమారు 50 ఏళ్ల క్రితం పేదలకు డి.ఫారం, అసైన్డ్ పట్టాలు పంపిణీ చేశారన్నారు. కొల్లేరు కాంటూరు, కొల్లేరు ఆపరేషన్ పేరుతో పేదలను ఇక్కడి నుంచి తరిమేసి పెత్తందారులు, సంపన్నులు అధికారుల సహకారంతో భూములను అక్రమంగా ఆక్రమించుకుని అనుభవిస్తున్నారన్నారు. ఈ భూములు తమవేనని 2007 నుంచి పేదలు న్యాయమైన పోరాటం చేస్తున్నా పోలీసులు, రెవెన్యూ యంత్రాంగం భూస్వాములకు కొమ్ముకాస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. భూస్వాములు అప్పీల్‌కు వెళ్లి పేదల భూములను అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు చట్టప్రకారం వ్యవహరించడం లేదని, పేదలపై దాడి చేసినా ఎటువంటి కేసులూ నమోదు చేయడం లేదని అన్నారు. తమ భూముల్లోకి వచ్చిన దళితులపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా భూస్వాములపై కేసులు నమోదు చేసి, అన్యాయానికి గురైన భూములను స్వాధీనం చేసుకుని పేదలకు భూములు పంపిణీ చేయాలని శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వమే సహకార సంఘాల ద్వారా పేదల చేపల చెరువులు అనుభవించేలా పట్టుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ పోరాటంలో ముందుముందు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని శ్రీనివాసరావు హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ పేదల భూములను అక్రమంగా అనుభవిస్తున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, పెట్టిన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లోని నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. చేపల చెరువుల్లో కోడి వ్యర్థాలు వేస్తూ నీటి కాలుష్యానికి కారకులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్.మహేష్, సిహెచ్.మాధవ, పి.ఆనంద్‌రావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, సిఐటియు నాయకులు జె.గోపి, పలువురు సిపిఎం నాయకులు, దోసపాడు గ్రామ పేదలు, దళితులు పాల్గొన్నారు.

గోదావరిలో ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

వల్లూరులో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఆచంట



గోదావరిలో మృతి చెందిన ఇద్దరు విద్యార్థుల మృతదేహాలు

వేసవి తాపాన్ని తట్టుకోలేక గోదావరిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ నీట మునిగిన ఘటనలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వల్లూరుకు చెందిన ఐదుగురు విద్యార్థులు భీమలాపురం వద్ద వశిష్ట గోదావరిలో స్నానానికి దిగారు. ఈ క్రమంలో వీరిలో కామిశెట్టి గిరిధర్ (15) ప్రవాహానికి కొట్టుకుపోతుండగా పక్కనే ఉన్న కొండేపూడి భానుప్రసాద్ (15) రక్షించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో వీరిద్దరూ నీట మునిగి గల్లంతయ్యారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు ఒడ్డుకు చేరుకుని గ్రామస్తులకు సమాచారం అందించారు. దీంతో గ్రామస్తులు, అధికారులు అక్కడకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా కొద్దిసేపటికే గిరిధర్, భాను ప్రసాద్ మృతదేహాలు లభ్యమయ్యాయి. దీంతో వల్లూరులో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. ఇద్దరు విద్యార్థులు వల్లూరు హైస్కూల్లో చదివి ఇటీవల ముగిసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాశారు. మృతుల్లో ఒకరైన కామిశెట్టి గిరిధర్ తల్లిదండ్రులు ఉపాధి నిమిత్తం ఇటీవలే ఇతర దేశాలకు వెళ్లారు. మరో విద్యార్థి కొండేపూడి భానుప్రసాద్ తండ్రి విక్రరబాబు కూడా ఉపాధి నిమిత్తం ఇతర దేశాలకు వెళ్లారు. రెండు కుటుంబాల్లో ఏకైక కుమారులు కావడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఆచంట ఎస్ఐ రాజ్‌కుమార్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతుల మేలుకోరే నూతన కొనుగోలు విధానం

రబీ ధాన్యం కొనుగోలుపై మంత్రి కారుమూరి సమీక్ష

ప్రజాశక్తి - తణుకు

రైతులు, మిల్లర్ల మేలుకోరి నూతన ధాన్యం కొనుగోలు విధానాన్ని ప్రవేశపెట్టినట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్ఎసి కళ్యాణ మండపంలో రబీ ధాన్యం కొనుగోలుపై రైస్ మిల్లర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు, రైతులు, అధికారులు కలిసికట్టుగా ధాన్యం కొనుగోలును విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. మిల్లర్లకు పాత బకాయిలు త్వరలోనే పూర్తిస్థాయిలో చెల్లిస్తామన్నారు. కృష్ణాజిల్లా నుండి గోనెసంచులు తెప్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. మిల్లర్లు సిఎంఆర్‌తో పాటు వ్యాపారం కూడా చేయాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టి మిల్లర్లను సర్వీస్ ప్రొవైడర్‌గా ఉంచడం జరిగిందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యానికి మద్దతు ధర కల్పించి రైతుల నుంచి ప్రయివేటు వ్యక్తులైనా ధాన్యాన్ని కొనుగోలు చేయొచ్చన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్లకు దీనిపై పూర్తిస్థాయి అధికారులున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వైస్ ఛైర్మన్ వీర పాండ్యన్, పశ్చిమగోదావరి, ఏలూరు జెసిలు ఎస్.రామసుందర్‌రెడ్డి, బి.లావణ్య వేణి, పశ్చిమ తూర్పు ఏలూరు జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సామంతపూడి రామరాజు, ఆళ్ల సతీష్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

సిపిఎం, సిపిఐ ప్రచార భేరిలో నేతలు



తాడేపల్లిగూడెంలో ప్రచార భేరి నిర్వహిస్తున్న నేతలు

ప్రజాశక్తి - కాళ్ల

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నిరసిస్తూ సిపిఎం, సిపిఐ చేపట్టిన రాజకీయ ప్రచారభేరి మండలంలో ఐదో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడగా మండా సూరిబాబు, తిరుమాని శ్రీను, గరికముక్కల ఆజమ్మ, పుచ్చకాయల వజ్రమ్మ, ఉన్నమట్ల శాంతమ్మ, బాతు రామస్వామి, యోహోషువా, దేవరకొండ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకివీడు: దేశంలో ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుదాం అనే నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచార భేరి యాత్ర మూడో రోజు సోమవారం సాగింది. యాత్రలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ మోడీ అధికారంలోకొచ్చాక గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, నేతలు షేక్ వలీ, బొడ్డుపల్లి రాంబాబు, డి.రవితేజ, వాసంశెట్టి సత్యవతి, బి.వర్మ పాల్గొన్నారు.

అత్తిలి: మన రాష్ట్రానికి మోడీ చేస్తున్న ద్రోహం అంతాఇంతా కాదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం ఉనికినిలో సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా కేతా గోపాలన్ మాట్లాడుతూ పార్లమెంట్ సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీల్లో ఏఒక్కటీ అమలు చేయని ఘనత మోడీకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు మల్లిపూడి రామాంజనేయులు, గూడూరి రాంబాబు, దొంగ దుర్గారావు, సిహెచ్.రామకృష్ణ, బి.శ్రీను, జి.రవి పాల్గొన్నారు.

పెనుమంట్ర: రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయలేని స్థితిలో రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేన ఉన్నాయని సిపిఎం మండల కార్యదర్శి కూసంపూడి సుబ్బరాజు అన్నారు. మంగళవారం సోమరాజు ఇల్లింద్రపర్రులో ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు దిద్దే వెంకట్రావు, పాలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: మతోన్మాద బిజెపి పాలనకు దేశంలోని ప్రజలంతా చరమగీతం పాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిపిఎం మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. మోడీని గద్దె దించండి.. దేశాన్ని కాపాడండి నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన చేపట్టిన ప్రచారభేరి యాత్ర మంగళవారం కొడమంచిలి, కోడేరు, ఉత్తరపాలెం, టి.మెరక, తామరచెరువు, పెదమల్లం, మిద్దేవారిపాలెం, చినమల్లం, గరువు, చింతలతోట, పైపోరా, కిందపోరా, ఆచంట చినపేట వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మతాన్ని అడ్డుపెట్టుకొని కుల, మత, ప్రాంతాల మధ్య చీలికలు తెచ్చేలా పరిపాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వ్యక్తులకు అతి కారుచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, సిపిఐ జిల్లా నాయకులు పిసి.జోషి, సిపిఎం నేతలు సిర్రా నరసింహమూర్తి, వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, ఇందుకూరి సూర్యనారాయణరాజు, తోటపల్లి సత్యనారాయణ, బొర్రా ధర్మారావు, వాసా రామ్మోహన్‌రావు,



కొడమంచిలి పంచాయతీ పరిధి టి.మెరకలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజ్‌గోపాల్

తలుపూరి బుల్లబ్బాయి, కొండేటి సత్యనారాయణ, సిర్రా విఘ్నేశ్వరుడు కొండేటి రాఘవులు, కారిపల్లి రాజు పాల్గొన్నారు.

తణుకు రూరల్: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, ఎఐటియుసి జిల్లా నాయకులు బొద్దాని నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో విశాఖ ఉక్కుపై బిజెపి ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్, నాగరాజు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని రక్షించడం మానేసి అమ్మేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, పిఎల్.నర్సింహారావు, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, ఎన్.ఆదినారాయణబాబు, వి.వెంకటేశ్వరరావు, మెడికల్ రిప్స్ యూనియన్ కార్యదర్శి ఎం.రమేష్, ప్రసాద్, టి.రామకృష్ణ, త్రిమూర్తులు, రమణ, సాంబశివరావు, శ్రీహరి, ఎఐటియుసి నాయకులు గుబ్బల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి యాత్ర కుంచనపల్లి, కెఎస్ఎన్ కాలనీలో మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. మోడీకి దేశాన్ని పాలించే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఇరు పార్టీల నేతలు మడక రాజు, కరెడ్ల రామకృష్ణ, శిద్ధిరెడ్డి శేషుబాబు, చిట్టేటి సత్యనారాయణ, పోతు శ్రీను, అల్లం రాము, దాస్యం రాము, రావూరి బాబీ, ఉయ్యూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆకివీడులో..

ప్రచార యాత్రలో భాగంగా తాడేపల్లిగూడెం మండలం దండగర్రలో ఆర్‌బికె వద్ద నిరసన తెలిపారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేయాలని నినదించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి ఉల్లంకల జయకృష్ణ, సిపిఎం నేత కండెల్లి సోమరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు గోపాల వెంకటరావు, కండెల్లి రమేష్‌బాబు, పి.జయమ్మ, సిపిఐ నాయకులు కర్రి సోమేశ్వరరావు, బందుల తాతయ్య, మద్ది సోంబాబు పాల్గొన్నారు.

పాలకోడేరు: రాబోయే ఎన్నికల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెప్పాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వేంద్రలో సిపిఎం, సిపిఐ చేపట్టిన రాజకీయ ప్రచారభేరి మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్లకు అనుకూల విధానాలు అవలంబిస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఆసిరియ, నాయకులు వైఎస్ఎన్.మూర్తి, తాడి రామారావు, అప్పారావు, లక్ష్మణస్వామి, సిపిఐ నాయకులు ఎ.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి: ఐకమత్యంగా ఉంటున్న ప్రజల్లో మతోన్మాదాన్ని నింపుతున్న బిజెపిని తరిమికొట్టాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎన్ఆర్‌పి.అగ్రహారంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ధనికొండ శ్రీనివాస్, సిపిఐ ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలను నియంత్రిస్తామని హామీ ఇచ్చిన మోడీ ధరల నియంత్రణలో దారుణంగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి రత్నకుమారి, కొట్టాడ వెంకటేశ్వరరావు, మజ్జి నాగేశ్వరరావు, కాల్వ ఏసు, బొడ్డుపల్లి ఆదాం, దుర్గాతి రమణ, సిపిఐ నాయకులు సనపల శ్రీనివాస్, పతివాడ దుర్గ గణపతి, వంజరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు : స్థానిక గాంధీబొమ్మ సెంటర్ ప్రాంతంలో సిపిఎం నాయకులు ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి యడ్ల చిట్టిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి నాగరాజు, వీరా పాండురంగారావు, చిలకలపూడి నాగేశ్వరరావు, అడ్డాల ఏడుకొండలు పాల్గొన్నారు.

పెనుగొండ: కోడిపందేల దిబ్బ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ప్రచార భేరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి సూర్నీడి వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మాదాసి నాగేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి

ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌వి.రాజేష్ డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సిపిఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమస్యలపై కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలొచ్చి ధర్నాలో పాల్గొన్నారు. మండుటెండను సైతం లెక్క చేయకుండా ఫ్ల కార్డులు చేతబూని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దుకు ఎన్నికల ముందు జగన్ హామీ ఇచ్చి అధికారం చేపట్టాక హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఇచ్చిన హామీలు తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డిఎలను, బకాయిలను వెంటనే ఇవ్వాలని కోరారు. ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వివి.పెద్దిరాజు మాట్లాడుతూ మార్చి తొమ్మిదో తేదీ నుండి ఉద్యమం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకూ వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్షులు ఎస్.శివశంకర్, కార్యదర్శి ఫణి, ఎపిఆర్ఎస్ఎ జిల్లా కార్యదర్శి ప్రసాదరాజు, గ్రామ, వార్డు సచివాలయాల రాష్ట్ర ట్రెజరర్ జగదీష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ రాంబాబు, సీనియర్ సహాయకులు వివి.పెద్దిరాజు, పి.జగన్మోహన్, కె.వరప్రసాద్, జి.కళ్యాణి, కె.కల్యాణి, పి.గౌతమి, పివి.సాంబశివరావు, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - తణుకురూరల్




రిలే నిరాహార దీక్షల్లో కూర్చున్న హమాలీ కార్మికులు

ఎపి సీడ్స్‌లో కొత్తగా ప్రవేశపెట్టిన టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి సీడ్స్ వద్ద టెండర్ రద్దు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న హమాలీ కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. రాష్ట్రంలో 18 యూనిట్లు ఉంటే అందులో ఎక్కడా లేనివిధంగా టెండర్ విధానాన్ని తణుకులోనే ఎందుకు ప్రవేశపెట్టడమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జి.త్రిమూర్తులు, రమణ, శ్రీహరి, సాంబశివరావు, సూరిబాబు పాల్గొన్నారు.

పేదల భూముల జోలికొస్తే సహించం

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

ప్రజాశక్తి - భీమవరం



చించినాడలో పేదల లంక భూముల జోలికొస్తే సహించేది లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం హెచ్చరించారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదల అనుభవంలో ఉన్న గోదావరి లంక భూముల్లో ఇసుకను తవ్వాలనే ప్రభుత్వ ప్రయత్నాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. చించినాడ గ్రామ పరిధిలో మూడు, నాలుగొందల కుటుంబాల పేదలు చాలాకాలంగా ఈ లంక భూములన అనుభవిస్తున్నాయన్నారు. ప్రభుత్వం పట్టాలు కూడా ఇచ్చిందన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు నష్టం చేకూరేలా ఆ భూముల్లో ఇసుకను తవ్వాలని ప్రయత్నిస్తోందన్నారు. వీరిలో దళితులు, బలహీనవర్గాలు, పేదలు ఉన్నారన్నారు. వీరికి నష్టం చేకూరేలా ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోరాదని విజ్ఞప్తి చేశారు. కోర్టు స్టే ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తమ భూములను కాపాడాలని చించినాడ గ్రామ ప్రజలు ఆందోళన చేస్తున్నారని గుర్తు చేశారు. ఒకవైపున ప్రభుత్వం దళితులు, పేదల కోసం పని చేస్తున్నామని చెబుతూనే, దళితులకు ప్రయోజనంగా ఉన్న లంక భూముల్లో ఇసుక తవ్వి వారి ప్రయోజనాల్ని దెబ్బతీయడం అన్యాయమన్నారు. తక్షణం ప్రభుత్వం ఈ చర్యను మానుకోవాలన్నారు. అధికారులు కోర్టు స్టేను దృష్టిలో పెట్టుకుని పేదలకు, లంక భూములకు రక్షణ కల్పించాలని కోరారు. లేనిపక్షంలో కలిసొచ్చే రాజకీయ పార్టీలను, సామాజిక సంఘాలను, సంస్థలను కలుపుకుని పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని బలరాం హెచ్చరించారు.

సిపిఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేసవి దాహార్తిని తీర్చడం కోసం దాతలు ముందుకు రావాలని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ గార రంగారావు అన్నారు. మంగళవారం స్థానిక అమరవీరుల భవనం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో సుందరయ్య చలి వేంద్రాన్ని గార రంగారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి ప్రతాప్ మాట్లాడుతూ ఏప్రిల్‌లోనే ఎండలు తీవ్రంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అన్ని ప్రధాన రహదారుల వెంబడి, మున్సిపల్ పరిధిలోని అన్ని కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

నాడు - నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

నాడు - నేడు కింద వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరు కార్యాలయం నుండి మండల స్థాయి అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడారు. నాడు నేడు రెండో విడతలో విడుదల చేసిన నిధుల నుండి మరుగుదొడ్లు, మేజర్, మైనర్ మరమ్మతు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఇఒ ఆర్. వెంకటరమణ, సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్, వివిధ శాఖల డిఇలు, ఎఇలు, ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు తెలిపారు. మాధవరం పిహెచ్‌సి పరిధిలోని నవాబ్‌పాలెం, కృష్ణాయపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్ హైజీన్ కార్యక్రమాల క్షేత్రస్థాయి పరిశీలన, కీటక నియంత్రణాచర్యలు, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలు దోమ తెరలు వాడాలన్నారు. ఇంటి కిటికీలకు, తలుపులకు జాలీలు బిగించుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. నీటి తొట్టెలను వారంరోజులకోసారి శుభ్రం చేసి తిరిగి నింపుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో 'అబేటు' స్ప్రే చేయాలని పంచాయితీ సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జి.రామకృష్ణ, ఎస్.అశోక్ బాబు, ఆరోగ్య సహాయకులు కె.లక్ష్మణరావు, ఇ.కాంతారావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిల్లా ఆసుపత్రిలో రోగుల సమస్యలు పరిష్కరించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందర రామరాజుకు సిపిఎం వినతిపత్రం అందజేసింది. మంగళవారం స్థానిక డెంటల్ ఆసుపత్రిలో సిపిఎం పట్టణ కార్యదర్శి పి.వి.ప్రతాప్, సిపిఎం పట్టణ నాయకులు గార రంగారావు, కామన మునిస్వామి మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రి స్థాయికి అనుగుణంగా డాక్టర్లు, సిబ్బందిని పెంచాల్సింది పోయి రిక్రస్టర్ పేరుతో తగ్గించడం వల్ల పేదలకు వైద్యం అందదని తెలిపారు. చాలా వార్డుల్లో సిబ్బంది కొరత ఉందని తెలిపారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలిపారు. అభివృద్ధి కమిటీ ఛైర్మన్ డి.సుందర రామరాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో కొన్ని సమస్యలు సిపిఎం తీసుకొచ్చిందన్నారు. వాటిని మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.

బాధితులకు టిడిపి సాయం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పెద్దపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయుడైన కొండేటి మునలయ్య కుటుంబానికి టిడిపి ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, నాయకులు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలం వెంకటరమణ, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సతీష్, కార్తీక్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుక్కర్ అందజేత

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రభుత్వం సంక్షేమానికి దాతల సహకారంతోడైతే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని కొణితివాడ మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు బాజింకి కృష్ణారావు అన్నారు. ఈ స్కూల్ ప్రాంగణంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రానికి దాత మంగళవారం ప్రెషర్ కుక్కర్ అందజేశారు. గ్రామానికి చెందిన రుత్తుల వెంకటసత్యనారాయణ, సత్యజ్యోతి కుమారుడు హర్షిత్ పుట్టినరోజును పురస్కరించుకుని రూ.6 వేల విలువైన కుక్కర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది సూర్యప్రభ, యశోధ, ఉపాధ్యాయులు లక్ష్మి, ఎ.వి.సత్యనారాయణ, వెంకటేశ్వరస్వామి పాల్గొన్నారు.

భవిష్యత్తుపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కాళ్ల

పదో తరగతి పాసైన విద్యార్థులు భవిష్యత్తులో తీసుకోవాల్సిన కోర్సులు, వాటి ప్రాముఖ్యత తప్పనిసరిగా తెలుసుకోవాలని సిబిఎస్ఇ కోఆర్డినేటర్ హిమబిందు అన్నారు. పెదఅమిరంలో వెస్ట్ బెర్రీ స్కూల్లో 8, 9వ తరగతి విద్యార్థులకు భవిష్యత్తుపై అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఓ క్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విశాఖపట్నం వారు కెరీర్ నెక్స్ అంశంపై చర్చించారు. సమగ్రాభివృద్ధి, బోధనాభ్యసన, బోధనేతర కార్యక్రమాల్లో ఏ విధంగా రాణించాలో విద్యార్థులకు వివరించారు. ఐబిడిపి ఇంగ్లీష్ ఫ్యాకల్టీ డో నా రేచల్ సామ్ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తి, ఆలోచనలు బట్టి వారు భవిష్యత్తులో ఎటువంటి కోర్సులు చేస్తే రాణిస్తారో వివరించారు. స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.హేమవతి మాట్లాడుతూ ఈ అవగాహనా సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ సదస్సులో వెస్ట్ బెర్రి స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన ఉత్పత్తులు

ప్రజాశక్తి - అత్తిలి

సేంద్రియ వ్యవసాయం వల్ల నాణ్యమైన ఆహార ఉత్పత్తులు సాధించొచ్చని సేంద్రియ వ్యవసాయ డిజిటల్ ఎల్2 గంటా రామకృష్ణ అన్నారు. మంగళవారం వరిఘేడు సేంద్రియ వ్యవసాయంపై రైతులతో ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నవధాన్యాల పంట గురించే రైతులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పంపన సత్యవతి, ఉప సర్పంచి అడ్డాల రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

అనాధ విద్యార్థులకు స్నాక్స్ అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వశిష్ఠ లియో క్లబ్ తరుపున లయన్ కోనా హనుమాన్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు సౌజన్యంతో మంగళవారం అనాధాశ్రమం విద్యార్థులకు లయన్ జొన్నల సతీష్‌కుమార్ పుట్టినరోజు, బుద్దాల వెంకట రామారావు పద్మావతి పెళ్లిరోజు సందర్భంగా స్నాక్స్,హెల్దీ డ్రింక్స్ అందచేశారు. అధ్యక్షులు లియో మాధురి మాట్లాడుతూ క్లబ్ తరపున విద్యార్థులకు మనోధైర్యం కల్పించడానికి ఇక్కడకు తరచూ వస్తున్నామని తెలిపారు. క్లబ్ స్పాన్సర్స్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు, లయన్ కోనా హనుమాన్ బ్రదర్స్ సహకారంతో వారికి అవసరమైన సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు పరదా

మొగల్తూరు:మండలంలోని గ్రామాల్లో మంగళవారం మంచు దుప్పటి పరుచుకుంది. మండు వేసవిలో మంచు విపరీతంగా పట్టడంతో రహదారులపై ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఒకదానికొకటి కనపడక వానదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తోటలో పచ్చని వరిచేలపై మంచు పరదా కమ్మేసింది. మార్నింగ్ వాకర్స్, ప్రకృతి ప్రేమికులు పచ్చని వరిచేలపై కమ్ముకున్న మంచుని చూసి పరవశించారు.

న్యాయం చేయాలని యువతి ధర్నా

మొగల్తూరు:ప్రేమ పేరుతో వంచించిన యువకునితోనే తనకు వివాహం చేయాలని కోరుతూ బాధిత యువతి, ఆమెకు మద్దతు తెలిపిన దళిత సంఘాల నాయకులు మంగళవారం మొగల్తూరు పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత యువత మాట్లాడుతూ భీమవరం గ్రామీణ మండలం బాబాయితిప్ప గ్రామానికి చెందిన కొండేటి సాయిపెళ్లి చేసుకుంటానని తనను నాలుగు సంవత్సరాలుగా మోసగిస్తూ వచ్చాడని తెలిపింది. ఇటీవల పెళ్లి విషయమై ప్రశ్నించగా తన ఇంట్లో పెద్దలు అంగీకరించడం లేదని చెబుతున్నాడని వాపోయింది. అతనితోనే పెళ్లి జరిపించాలని స్టేషన్ వద్ద సుమారు మూడు గంటలు నిరసన తెలిపింది. సిఐ వి.సురేష్ బాబు వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. బాధిత మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో బాధిత మహిళ దళిత సంఘాల నాయకులు ఆందోళన విరమించారు.



పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న యువతి, దళిత సంఘాల నాయకులు

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

అప్పడా వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురాం

ప్రజాశక్తి - ఉండి

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని అప్పడా వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురాం అన్నారు. మంగళవారం వాంద్రం గ్రామంలోని ఫిష్ ట్రేడర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వడ్డీ రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్వా రైతు గాదిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ జిల్లాలో ఆక్వా కెపాసిటీ లక్ష టన్నులైతే సగటున ఉత్పత్తి లక్షా 50 వేల టన్నులు జరుగుతోందని, దీనివల్ల 50 వేల టన్నుల సరుకు మిగిలిపోయి రేటు తగ్గుముఖం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాల్వ నీటితో ఆక్వా సాగు చేసే అవకాశం గోదావరి జిల్లాలో లేదని, బోర్ వాటర్‌తో ఆక్వా సాగు బాగుంటుందని అయితే బోర్లు తవ్వుతుంటే కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నారని దీంతో అధికారులు బోర్‌ను అడ్డుకుంటున్నారని రైతులు అప్పడా వైస్ ఛైర్మన్ దృష్టికి



మాట్లాడుతున్న అప్పడా వైస్ ఛైర్మన్ రఘురాం

తెచ్చారు. కోనసీమ ఆక్వా రైతు సంఘం నాయకులు నాగభూషణం మాట్లాడుతూ రైతుల్లో ఐకమత్యం లేకపోవడం వల్లే ఆక్వా రైతులకు దుర్భర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. బోర్ వేసేటప్పుడు సరిహద్దు రైతు ఫిర్యాదు చేస్తే బాగుంటుందని కానీ సుదూర ప్రాంతంలో ఉండే వ్యక్తులు కూడా స్పందనలో ఫిర్యాదు చేస్తున్నారని, వాటిని అధికారులు స్వీకరించడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆక్వా రైతు జికెఎఫ్ సుబ్బరాజు మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి నాటికి పది ఎకరాల్లోపు రైతులకు విద్యుత్ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని దానికి కారణం అప్పడా వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురాం అన్నారు. అనంతరం అప్పడా వైస్ ఛైర్మన్ వడ్డీ రఘురాం మాట్లాడుతూ ఆక్వా రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. పదెకరాల పైబడి సుమారు 93 వేల ఎకరాలు సాగు చేస్తున్నారని వీరికి కూడా విద్యుత్ సబ్సిడీ ఇప్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సీడ్ క్వాలిటీ, ఫీడ్ ధరల నియంత్రణ లేకపోతే కంపెనీ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆక్వా రైతులకు మెరుగైన సేవలందిస్తున్న భీమవరం ఎఫ్‌డిఒ లావణ్య, శృంగవృక్షం గ్రామ ఫిషరీస్ అసిస్టెంట్ లక్ష్మీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆక్వా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకొల్లు మున్సిపాల్టీల్లో ఐదు గ్రామాలు విలీనం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మున్సిపాల్టీలో 5 గ్రామాలు విలీనం కానున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు జారీచేశారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ, పూలపల్లి, భగ్గేశ్వరం, ఉల్లంపర్రు, వరిధనం గ్రామాలు విలీనం అయినట్లు ఆమె పేర్కొన్నారు. దీంతో ఆయా పంచాయతీ కార్యదర్శులు వెంటనే సామగ్రి, రిజిస్టర్లు మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించాలని జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. అయితే 5 గ్రామాల విలీనం గురించి తమకు ఉత్తర్వులు వచ్చాయని మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాక తగిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి మీడియాకు తెలిపారు.

ఫిబ్రవరి నెలలోనే జిల్లా కలెక్టర్ 5 గ్రామాలు విలీనం అయినట్లు భీమవరంలో మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. 5 నెలల నుంచి 5 గ్రామాల్లో చెత్త సేకరణను మున్సిపల్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. 2 నెలలుగా సచివాలయాలకు సంబంధించి సిస్టమ్ మున్సిపల్ నిబంధనలు ప్రకారం జరుగుతున్నాయి.

పది మూల్యాంకన కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికగా జరుగుతున్న పదో తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. డిఇఒ వెంకటరమణ మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి ప్రారంభమైన మూల్యాంకనం 26వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. 27 నుండి 30 వరకు ఓపెన్ స్కూల్ పదో పరీక్షా పత్రాల మూల్యాంకన జరుగుతుందన్నారు. అప్పటి వరకూ హైస్కూల్ పరసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సుందరాజు, ఎంపిడిఒ ఉమామహేశ్వరరావు, సర్పంచి చికిలే మంగతాయారు పాల్గొన్నారు.

పాఠశాలలకు సమ్మేటివ్ పత్రాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

సమ్మేటివ్ అసెస్మెంట్ 2 పత్రాలను ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఒ డి.శారదాజ్యోత్స్న తెలిపారు. మంగళవారం ఎంఇఒ కార్యాలయం నుంచి ఈ నెల 30న ఒకటి నుంచి 9వ తరగతి వరకూ జరిగే సమ్మేటివ్ అసెస్మెంట్ టు పత్రాలను ఆయా పాఠశాలలకు సిఆర్‌పిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ ఒకటి నుండి 5వ తరగతి వరకూ ప్రయిమరీ స్కూల్లో సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు, 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ హైస్కూల్లో జరిగే పరీక్షలకు ప్రశ్నాపత్రాలను ఉపాధ్యాయులకు అందిస్తున్నట్టు తెలిపారు. అదే విధంగా ఈ పరీక్షలో 37 ప్రయిమరీ, 5 యుపి, 7 హైస్కూల్, 16 ప్రయివేటు, ఒక గురుకుల పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులకు పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు వి.ప్రసాద్, నక్కా నరేష్‌కుమార్, కెఎ మంగతాయారు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్ట్

ప్రజాశక్తి - తణుకు

పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న నిర్వాహకులను పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని పాతూరులో ఎకెటిపి స్కూల్ దగ్గర్లోని ఓ ఇంట్లో ఒక రూము అద్దెకు తీసుకుని బెట్టింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. బెట్టింగ్ నిర్వహిస్తున్న తణుకు పట్టణానికి చెందిన బంగారు సాయి దుర్గాప్రసాద్, గొర్రెల కాళేశ్వరరావు, మాదలవలస సాయి దుర్గ ప్రసాద్- మెరుగు పురుగు ప్రదీప్, అత్తిలి మండలం చెందిన ఇళ్ల చందులను అదుపులో తీసుకుని వారి వద్ద నుండి రూ.17,300 నగదు 12 సెల్‌ఫోన్లు, ఒక లాప్టాప్, ట్యాబ్, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మధ్యవర్తుల సమక్షంలో సిఐ ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

నేడు జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం

భీమవరం :చించినాడ గ్రామంలో దళితుల లంకభూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని కోరుతూ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనె 19న జిల్లా స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు కె.క్రాంతి బాబు, జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. చించినాడ గ్రామంలో ఎస్‌సి, బిసి కుటుంబాలకు చెందిన 60 ఎకరాల భూములకు 1983 ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఆ భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేసుకునే వారని పేర్కొన్నారు. కరోనా అనంతరం ఆక్వా చెరువుల ప్రభావం వల్ల ఉమ్మడిగా ఆక్వా సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో గోదారి వల్ల పెరుగు భూమి 10 ఎకరాలు పెరిగిందని తెలిపారు. ఈ భూమిని పేద కుటుంబాల వారు ఉపయోగించుకుంటున్నారని పేర్కొన్నారు. అయితే భూస్వాములు, అధికారులు క్రమంగా పదెకరాల భూముల్లో మట్టి తవ్వకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. ఈ భూముల్లో మట్టి తవ్వకాలు ఆపాలని, ఆ భూములను పేదలు ఉపయోగించుకునే విధంగా రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వివిధ అంశాలు చర్చించనున్నామని తెలిపారు.

ప్రయివేటు స్కూళ్ల పరిస్థితి దారుణం

ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ప్రయివేటు స్కూళ్ల సమస్యలు పెరిగాయని ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంఎల్‌సి ఎం.వి.రామచంద్రారెడ్డి చెప్పారు. ఎంఎల్‌సిగా ఎన్నికై తొలిసారి జిల్లాకు వచ్చిన రామచంద్రారెడ్డిని ఎపి ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్య సంఘం ఆయను మంగళవారం ఘనంగా సత్కరించింది. సంఘం జిల్లా సమావేశం తొలిసారిగా స్థానిక లయన్స్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షులు పాపారావు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. పేదల పిల్లలకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలనే ధ్యేయం నెరవేరదన్నారు. ప్రభుత్వం వద్ద మెరిట్ బోధకులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉండగా ఆ భారం తమపై రుద్దడం ఏంటని ప్రశ్నించారు. ప్రయివేటు స్కూళ్ల సమస్యల పరిష్కారానికి విధాన సభ వేదికగా పోరాడతామన్నారు. ప్రభుత్వ విధానాలతో 80 శాతం ప్రయివేట్ స్కూళ్లు మూతబడే స్థితిలో ఉన్నాయని ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ కెటివి ప్రసాద్, ఎంబిఎస్.శర్మ, గౌరవాధ్యక్షులు గోపాలకృష్ణ, ఎంవి.రావు, జెఎస్‌పి బాలాజీ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గంలో అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు జరిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులను కల్పించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. విస్సాకోడేరు లేఅవుట్‌లో లబ్ధిదారులు వేగవంతంగా గృహ నిర్మాణాలు జరుపుకుంటున్నారని తెలిపారు. ఆ కాలనీలకు పూర్తిస్థాయిలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు అదనంగా త్రీఫేస్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఇఇ వెంకటరమణ, ఎఇ శశికుమార్ పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు తెలిపారు. మంగళవారం భీమవరం డిఎన్ఆర కళాశాల క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి నాయీ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సిద్దవటం యానా దయ్య, టోర్నీ నిర్వాహకుడు కోడూరి రామకృష్ణ మాట్లాడారు. విజేతలకు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు నగదు బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ్య పాల్గొన్నారు.

ప్రజాదరణ అభినందనీయం

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో ఇంటింటా వస్తున్న ప్రజాదరణ అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గొల్లలకోడేరులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి గ్రామ కన్వీనర్ చేకూరి రాజా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన పివిఎల్ నరసింహరాజు, ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు)కు వైసిపి గ్రామ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహారాజుతో పాటు, గ్రామ వైసిపి నాయకులు ఇంటింటా తిరిగి స్టిక్కర్లు అతికించి ఆయా కుటుంబాల వారికి ఇప్పటివరకూ జరిగిన అభివృద్ధి వివరించి రాబోయే రోజుల్లో వైసిపికి అండగా ఉండాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు నూటికి 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాజా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజాదరణ చూసి టిడిపి, జనసేన ఓర్వలేక అసత్య ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్, వైసిపి ముఖ్య నాయకులు జివి.నరసింహారావు, ఎంపిటిసి కరోతి వెంకటలక్ష్మి, నాయకులు హనుమంతరావు, సహదేవుడ, నాగరాజు, నేతల సాల్మన్, బాబూరావు, శ్రీను గోపాలరావు, నరేష్, ప్రసాద్, సత్యనారాయణ, సందీప్ పాల్గొన్నారు.



బ్రోచర్ అందిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు డిసిసిబి ఛైర్మన్, వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మంగళవారం యండగండి గ్రామంలో తిమ్మరాజు కాలనీ లేఅవుట్, శివాలయం లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మించుకున్న వారికి విద్యుత్ సౌకర్యం కోసం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పివిఎల్ మాట్లాడుతూ అన్ని జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్న కృష్ణమూర్తి, వైసిపి గ్రామాధ్యక్షులు టమటమల గోపాలకృష్ణమూర్తి, నేతలు వేగేశ్న వేణు, టోనీబాబు, ప్రసంగి, రామరాజు, సత్తిరాజు, ట్రాన్స్‌కో ఎఇ ముదునూరి మాధవరాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి కెవిఎస్ఎస్ రామలక్ష్మి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

20న హైబ్రీడ్ సూర్యగ్రహణం

ఉండి:వినీలాకాశంలో అరుదైన, అద్భుతమైన 'హైబ్రిడ్' సూర్యగ్రహణం ఈ నెల 20న ఏర్పడనుందని జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకుడు గాదిరాజు రంగరాజు మంగళవారం తెలిపారు. హిందూ క్యాలెండర్ ప్రకారం సంవత్సరంలో మొదటి సూర్య గ్రహణం వైశాఖమాసంలో ఏర్పడుతుందని, ఈ ఏడాది తొలి సూర్యగ్రహణం ఈనెల 20న ఏర్పడనుందని తెలిపారు. భూమి, సూర్యుని మధ్య చంద్రుడు వెళ్తున్నప్పుడు సూర్యగ్రహణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ హైబ్రిడ్ సూర్యగ్రహణం బుధవారం ఉదయం 7 గంటల నాలుగు నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 29 నిమిషాల మధ్య సంభవిస్తుందని తెలిపారు. ఈ సూర్యగ్రహణం భారతదేశంలో కనిపించదని రంగరాజు తెలిపారు.

అమలు కాని కలెక్టర్ ఉత్తర్వులు..!

ప్రజాశక్తి - వీరవాసరం

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలు అందించడానికి డిడిఒ కార్యదర్శులు అనుబంధంగా గ్రేడ్-5 కార్యదర్శులను నియమించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జనవరిలో జిఒ 2ను తీసుకొచ్చింది. ఈ జిఒను అనుసరించి జిల్లా వ్యాప్తంగా ఎక్కడ గ్రేడ్-5 కార్యదర్శులు లేరో అక్కడ గ్రేడ్-5 కార్యదర్శులను నియమిస్తూ వారికి మరిన్ని అధికారాలు బదలాయిస్తూ గత ఫిబ్రవరిలో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఉత్తర్వులు ఇచ్చారు. అయితే కలెక్టర్ ఉత్తర్వులు ఎక్కడా అమలు కావడంలేదని తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు మరో వంద మందిని గ్రేడ్-5 కార్యదర్శులుగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే జిల్లాలో అధిక శాతం మంది గ్రేడ్-5 కార్యదర్శులు కలెక్టర్ ఉత్తర్వులను అనుసరించి బాధ్యతలు చేపట్టినప్పటికీ విధులు మాత్రం నిర్వర్తించడం లేదన్నది సమాచారం. ఒక్కో పంచాయతీ కార్యదర్శికి (డిడిఒ) నాలుగు నుంచి ఆరు సచివాలయాలకు డిడిఒ బాధ్యతలు ఉండడంతో వారు ఎక్కడ ఎప్పుడు ఏ సమయంలో, ఏ సచివాలయంలో అందుబాటులో ఉంటారో తెలియని పరిస్థితి. ఈ పరిస్థితుల వల్ల ఒక డిడిఒ ఓ సచివాలయంలో పూర్తి కాలం అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రజలు తమ ధ్రువపత్రాల నిమిత్తం డిడిఒల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి. సమస్యను అధిగమించడానికే జిఒ 2 తీసుకొచ్చారు. ఈ జిఒను అనుసరించి గ్రేడ్-5 కార్యదర్శులు చేయాల్సిన పనుల జాబ్ ఛార్ట్ కూడా రూపొందించారు. గతంలో పంచాయతీ కార్యదర్శులు (డిడిఒలు) నిర్వర్తించే పన్నుల వసూలు, శానిటేషన్, స్పందన వంటి విధులు మినహాయించి పంచాయతీ బోర్డు సమావేశాలు, క్యాష్‌బుక్, ఎంబుక్ వంటి విధులతో పాటు గతంలో పంచాయతీ కార్యదర్శులు (డిడిఒలు) నిర్వర్తించే దాదాపు విధులన్నీ గ్రేడ్-5 కార్యదర్శులు నిర్వర్తించాల్సి ఉంది. తద్వారా ప్రభుత్వం అందించే సేవలు ప్రజలకు సత్వరమే అందుకునే ఆస్కారం ఏర్పడాలన్నది జిఒ 2 ఉద్దేశం. అయితే కలెక్టర్ ఉత్తర్వుల అమలు పట్ల కొంత మంది మండల స్థాయి అధికారులు నిరాశక్తిగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి కారణాలు జిల్లా అధికారులు పరిశీలించాల్సి ఉంది. కలెక్టర్ ఉత్తర్వులను అమలు చేసి పర్యవేక్షించాల్సిన మండల అధికారులు ప్రజలకు సత్వర సేవలందించే దిశగా ఆలోచించకపోవడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ప్రజాప్రయోజనార్థం తీసుకొచ్చిన జిఒను పూర్తిస్థాయిలో అమలు చేసే విధంగా జిల్లా అధికారులు దృష్టిపెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

భీమవరం రూరల్:ఎపి ఎలక్ట్రికల్ ఎంప్లాయిస్ యూనియన్ భీమవరం డివిజన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం రాత్రి స్థానిక ఎస్ కన్వెన్షన్లో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో రిగింది. ఏలూరు ప్రాంతీయ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.నరసింహారావు, ఎం.రమేష్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. డివిజన్ అధ్యక్షునిగా వై.నరసింహారావు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా ఎ.సత్యనారాయణ, కార్యదర్శిగా ఆర్.మురళీకృష్ణమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శిగా డి.త్రిమూర్తులు ఎన్నికయ్యారు.

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

తణుకురూరల్:వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.2,500లతో పని చేస్తున్న ప్రమోషన్ ఉపాధ్యాయులకు శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగోన్నతులు కల్పించాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్‌ను రూపొందించి, జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసేలా నియామకాలు జరగాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని, ప్లస్-2గా మార్చిన ప్రతీ జూనియర్ కళాశాలకూ సబ్జెక్టు టీచర్లను నియమించే విధంగా మెగా డిఎస్‌సి నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చు బాలబాలికలకు గుణాత్మకమైన, నాణ్యమైన విద్యను అందించాలని తెలిపారు.

ఓగేశ్వరరావుకు డాక్టరేట్

ఆకివీడు :మండలంలోని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న తంగి. ఓగేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులు ఇ.మాధవి పర్యవేక్షణలో 'కరణం బాలసుబ్రహ్మణ్యం పిల్లే రచనలుపాత్రల చిత్రీకరణ' అనే అంశంపై జరిపిన పరిశోధనలకు గాను తనకు ఈ గౌరవ పురస్కారం లభించినట్లు ఓగేశ్వరరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఆయనను కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత, సహాధ్యాపకులు, సిబ్బంది అభినందించి సత్కరించారు.